# ఉత్తరం

రచన:

పి. పద్మావతి

"కనులు మాటలాడునని - మనసు పాటపాడునని .. సుశీల, ఘంటసాలల యుగళ గీతం వివిధ భారతిలో మృదు మధురంగా విన్పిస్తోంది."

పరవశంలో ఈ లోకాన్నే మరచి పాట వింటున్న ఉషకి బాబిగాడు పద్మవ్యూహంలో అభిమన్యునిలా చుట్టూ సామాను వేసుకుని చిందులు తొక్కుతున్న సంగతి గాని, శ్రీవారు ప్రభాకరం వచ్చిన సంగతి గాని తెలియ లేదు. చాలాసేపు చూసి, చూసి విసుగెత్తిన ప్రభాకరం బాబిగాడిని ఒక్క లాగు లాగి కూర్చోబెట్టాడు. ఏడవ బోయిన బాబిగాడు తండ్రిని చూసి సంతోషంతో ఆట అన్నీ మరచిపోయి వాటేసుకున్నాడు. పాట పూర్త యింది. గలాటావిని ఈ లోకంలోకొచ్చింది ఉష. ఎదురుగా భర్త. అరె! ఎంత సేపయింది వచ్చి అంది నొచ్చుకుంటూ. ఇప్పుడే వచ్చాను. దేవిగారు సర్వం మరచి పాట వింటున్నారు. డిస్టర్బ చేయడమెందుకని. బలె వారె! అంటూ నవ్వి, ఉండండి కాఫీ తీసుకొస్తాను అంటూ వంటింటి లోనికి దారి తీసింది ఉష. ఉష వెళ్ళిన వైపే చూస్తూ ప్రభాకరం ఆలోచనల్లో పడ్డాడు. ఉష లేకపోతే నేనింత ఆనందం అనుభవించే వాడినా?

చిన్నతనంలో ఆస్తిని, తల్లి, తండ్రులను పోగొట్టుకున్న తనని బంధువులు అనుకున్న రాబందులు, విసిరికొట్టారు. దిక్కులేక అల్లాడిపోతున్న సమయంలో తన తల్లికి దూరపు వరుస అన్నగారైన రఘురామయ్యగారు చేరదీసి ఆదరించి అన్నంపెట్టి తన్నింతవాణ్ణి చేసారు. రఘురామయ్యగారికి నలుగురు కొడుకులు, ఒక అమ్మాయి. అందరికన్న చిన్నది, గారాలపట్టి, అందాలబొమ్మ ఉష. ఆ ఇంట్లో తనని అందరూ నిర్లక్ష్యపరచి అనాదరించిన వారె ఒక్క సుధాకరం, ఉష తప్ప. తనని చూస్తేనె అసహ్యించుకొనె సీతమ్మగారు, అంటె రఘురామయ్యగారి భార్య. ఎలాగో కష్టపడి రఘురామయ్యగారి ఆదరంతో, వారి పెద్దబ్బాయి సుధాకరం ప్రోత్సాహంతో ఎమ్.కామ్ చదివాడు. తను పాసయిన రోజున ఆ ఇంట్లో పండగ జరిపించారు ముగ్గురూ. వెంటనే రఘురామయ్యగారి రికమెండేషన్ వల్ల తనకి పెద్ద ఆఫీసులో ఉద్యోగం వచ్చింది.

తను రేపే వైజాగ్ వెళ్ళిపోవడం బట్టలన్నీ సర్దుకుంటున్నాడు. నాన్నగారు పిలుస్తున్నారంటూ వచ్చింది ఉష. సర్దటం ఆపి వెళ్ళాడు తను. ఏమోయి! అలా కూర్చో అని సోఫా చూపించారు. ప్రభా! జాబు వచ్చింది ఇక ఏంచేస్తావు? అన్నారు తాపీగా. ఏం చెప్పాలో తెలియక తలవంచుకున్నాడు ఆలోచిస్తూ. ప్రభా! నేనెళ్ళేముందో అనుకుంటున్నాను, ఉషని నీకిద్దామని, ఉషని కూడా ఇప్పుడే అడిగాను. నా చిట్టి తల్లికి నువ్వంటె ప్రాణం. నీ అభిప్రాయం ఆలోచించి చెప్పు అంటూ ఆగారు. ఉలిక్కి పడ్డాడు తను. ఏమిటి? తను వింటున్నది కలా? నిజమా? కోరితే కోటీశ్వరు అల్లుళ్ళయి వాలుతారు వాళ్ళముందు ఆయనకి. తనెక్కడ? వాళ్ళెక్కడ? నక్క, నాగలోకం సామెత చెబుతారె, అలావుంది. కంగారు లేదులే ప్రభా! నెమ్మది మీదనే చెప్పు అన్నారు మళ్ళా. తను ఏం చెప్పగలడు? తను ఆ ఇంట్లో కాలు పెట్టినప్పటి నుండి తనతో పాటు తన హృదయంలో ఉష మీద ప్రేమ పెరిగి పెద్దదయిందని. కాని తనకా ఆలోచనలు మంచివి కావని తనకి నీడ నిచ్చినవారి అంతస్తెక్కడ? తనెక్కడ? అందుకె తన వలపులన్నీ తనలోనే సమాధి చేసుకున్నాడు. మరి ఇపుడు అదృష్టదేవత ఎదుట నిలబడి అడుగుతున్నట్లుంది, ఇంతకంటె మహాభాగ్యం కావాలి? తనకు. అందుకె తడబాటుతో తలవూపాడు తను.

ఆ పెళ్ళికి, ఆ ఇంట్లో కొంతమంది ఇష్టపడలేదు. అయినా రఘురామయ్యగారు లెక్క చేయలేదు. కొందరు బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల అభినందనములతో పెళ్ళి మహా వైభవంగా జరిపించారు. సీతమ్మగారికి, ఉష చిన్నన్నయ్యలకు కూడ ప్రభాకరం మీద, అతని వ్యక్తిత్వం మీద మంచి అభిప్రాయమేర్పడింది. ఆ తరువాత భార్యాసమేతంగా ఉద్యోగరీత్యా వైజాగ్ వచ్చి ఉండిపోయాడు. తరువాత 2 సం||లకు బాబిగాడు పుట్టాడు. వాడిపేరు రాఘవేంద్ర. అప్పటినుంచి జీవితం సాఫీగా, ఆనందంగా గడిచిపోతున్నది. మనసు తెలుసుకుని మసిలె ఇల్లాలు, ఎపుడూ కలతలెత్తా ఎరుగని ఆ దంపతుల అన్యోన్యత ఇరుగు, పొరుగువారికి, బంధువు

అది ముచ్చట గొల్పేది. ఇపుడు ప్రభాకరం పెద్ద గెజిటెడ్ ఆఫీసరు. పెద్ద బంగళా, జీపు.

ఏమండోయ్! ఏమిటి? అంత ఆలోచనల్లో మునిగి పోయారు? ఉష మాటలకి ఉలిక్కిపడి చూశాడు. ఇదిగో కాఫీ తీసుకోండి అంటోంది. ఇదిగో వస్తున్నా! అయ్యగారికి నీళ్ళుపెట్టు స్నానం చేస్తారు అంటూ పనిమనిషిని పిలుస్తూ లోపలి కెళ్ళిపోయింది.

మర్నాడు ఉదయం 8 గంటలకి టిఫిన్, కాఫీ తీసి కొని డ్రెస్సింగ్ టేబుల్ ముందుకు వచ్చి టై కట్టుకుంటూ అప్పన్నా, అప్పన్నా అంటూ పిల్చాడు. ఏం బాబూ అంటూ హడావుడి పడుతూవచ్చిన అప్పన్నతో ఏంలేదు? జీపు సిద్ధం చెయ్యి అన్నాడు. ఉషా! కెళ్ళొస్తున్నా అని బాబిగాడిని ముద్దులతో నింపేసి టా-టా-బై-బై అంటూ జీపు స్టార్టు చేసి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం భోజనం చేసివచ్చిన ప్రభాకరానికి ఉత్తరం పట్టుకొచ్చి ఇచ్చింది ఉష. ఇంకో ఉత్తరం చేతిలో ఉంది. ఏమండీ ఈ ఉత్తరం ఎక్కడ నుండి వచ్చిందో చెప్పాలి అంది ఊరిస్తూ. ఉష ముఖం సంతోషంతో వెలిగిపోతోంది. ఏమిటండోయ్ దేవిగారు అంత ఉషారుగా ఉన్నారు? ఏదో విశేషమే ఉంది, అంటూ ఉష దగ్గర ఉత్తరం లాక్కున్నాడు. ఇంతకీ అది పెద్ద బావమరిది సుధాకరం వ్రాసిన ఉత్తరం. సుధాకరానికి పాప పుట్టిందట. ఇంట్లో అందరూ సంతోషంగా ఉన్నారట. అన్నీ మేనత్త పోలికలేనట. నాయనమ్మ, తాతగారు, బాబాయిలు అందరూ మళ్ళీ చిన్నారి ఉష కలిగిందని సంతోషిస్తున్నారు. ఇద్దర్నీ రమ్మని మరీ మరీ రాసాడు. సుధాకరం 4 రోజులలో వస్తానన్నాడు తీసికెళ్ళడానికి పాప బారసాలట.

ఓహో! అందుకన్నమాట అంత ఉషారు. మళ్ళా ఆడపడచు లాంఛనాలు అందుకోవచ్చని అన్న ప్రభాకరం మాటలకి, అందుకేం కాదు పుట్టినది సరిగా మా అన్నయ్య నోములపంట, వాడి చిన్నారి మేనకోడలిని, నా కోడలుగా చేసుకుందామని అంది చిరు కోపంగా. రెండవ ఉత్తరం చదివిన ప్రభాకరం ఒక్క ఎగురు ఎగిరి ఉషని ఆకాశానికెత్తినంత పనిచేసాడు. అరరె! ఏమిటండీ అంత ఉషారంటూ విడిపించుకుంది. ఈ ఉత్తరం చూడు నీకే తెలుస్తుంది అంటూ ఉత్తరం ఉషకిచ్చి బాతురూం కెళ్ళాడు.

కొంకాడా.

డియర్ రాజా,

నన్ను పూర్తిగా మర్చిపోయావు కదూ! అవునులే అపరంజి బొమ్మలాంటి నీ శ్రీమతి, నిన్ను ఉద్ధరించడానికి పుట్టిన నీ కంఠోద్ధారకుడు ఉండగా నేనెలా గుర్తుంటాను. చిన్నప్పుడు మనం ఆడుకున్న ఆటలు, కోతి కొమ్మచ్చులు, గోలీలు, మొగుడూ-పెళ్ళాలాటలూ అన్నీ మరచి పోయావా! పెళ్ళికూతురులా నిజంగా సిగ్గుగా ఉండేది నాకు. గోదావరి ఇసుక మన తలంబ్రాలు. ఇంటికి వెళ్ళాక పెద్దవాళ్ళ దెబ్బలు తినేవాళ్ళం. అయినా షరా మామూలే. చిన్ననాటి రోజులన్నీ చాలా బాగుండేవి. రాజా! నీకో గుడ్ న్యూస్ చెప్పనా? మరల నవ్వు. నేను ఆనందంగా తిరిగే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. నాకు వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయింది. 13.వ తేదీన బయలుదేరి వస్తున్నా. ఈ విషయం మా చెల్లెలికి చెప్పు. ఇక నన్ను ఎవరూ విడదీయ లేరు నీ నుంచి రాజా! నేను నీపట్టమహిషిగా ఉండనా మరి.

ఇట్లు
ముద్దులతో నీ రాణి.

ఉత్తరం అంతా చదివిన ఉష బిగుసుకుపోయింది.



ఏమిటీ చిత్రం అందుకేనా ఆయన అంత సంతోషంగా ఉన్నారు? అయినా తన కెందుకిచ్చారు ఉత్తరం? ఎప్పుడూ తనతో ఈ మాట చెప్పనైనా లేదు నిజంగా వాళ్ళది ప్రణయ స్నేహమేనా? కాకపోతే ఎందుకిలా ఉత్తరం వ్రాస్తుంది? ఆయనకి స్నేహితు లెవరూ లేరు. ఇలా ఎప్పుడు జరిగింది? వాళ్ళమ్మా, నాన్న ఉన్నప్పటి మాటనుకుంటాను. ఎంత దగా? ఎంత మోసం? ఏమి ఎరగని నంగనాచిలా ఉంటారు. ఇలా తడి గుడ్డలతో గొంతు కోస్తారనుకోలేదు. ఇంతలో ప్రభాకరం టవలుతో ముఖం తుడుచుకుంటూ ఉషా! అంటూ వచ్చాడు. ఉష ముఖంలో రంగు మారుతున్నట్టు గమనించలేదు. తన ధోరణి తను చెప్పుకు పోసాగాడు. చిన్నప్పుడు మేం ఎన్నో నాటకాలు వేసే వాళ్ళం. నేను కృష్ణుడు గాను, రాణి రాధగాను వేసేవాళ్ళం. ఇంటి దగ్గర నాన్నగారు రాణీ, ఆ గంతులు ఏమిట్రా చదువుకోకుండా అంటూ కోప్పడేవారు. అమ్మ మాత్రం ముచ్చట పడేది. ఆ తరువాత మా పరిస్థితులు మారిపోయినవి. నేను మీ దగ్గరకు వచ్చేసాను. అప్పటినుండి అక్కడి నుండి వెళ్ళిపోయి వాళ్ళ చిన్నాన్నగారి దగ్గర బొంబాయిలో చదువుకొని ఉద్యోగంలో స్థిరపడి అక్కడే ఉండిపోయినట్లు తెలిసింది. ఆ తరువాత చాలా కాలానికి తరచు లెటర్సు వ్రాసుకునే ఉషా! రాణి అంటే... చాలు ఇక ఆపండి చెప్పనక్కరలేదు. ఉష మాటల లోని తీవ్రతకు నివ్వెరపోయి చూసాడు. సరే బాగానే ఉంది ఆవిడనే పెళ్ళి చేసుకోవాల్సింది అంది కోపాన్ని దిగమింగుకుంటూ, పకపక నవ్వేసాడు, ఆవిణ్ణి చేసుకుంటె నిన్ను చేసుకొనే వాళ్ళు ఉండరని, సంతోషంలో ఉన్న ప్రభాకరానికి ఉష మనసులోని అనుమానం అర్థం కాలేదు. ఆ మాటతో ఉష రెచ్చిపోయింది. అవును పాపం. నాకే కాకపోనో, మీకే కాకపోనో అందరికి తెలుసు. మా నాన్నగారు, అన్నయ్యలు మీరు తేనె పూసిన కత్తి అని తెలియక మోసపోయారు. ఇప్పుడు బయట పడింది అసలు రంగు. ఛీ! ఛీ! ఇంత వంచిస్తారనుకోలేదు. ఏనాడైనా మనస్సు విప్పి చెప్పారా? ఎంత మోసం? ఇంకెందుకు? ఈ పాడు బ్రతుకు? ఉషకి శరీరమంతా కోపంతో, ఉద్వేగంతో ఊగి పోతోంది. ఉషా! ఏమిటి నువ్వ నేది? చేష్టలుడిగి నిలబడిపోయాడు. ఏం చెప్పాలో అర్థం కాలేదు. తరువాత కొంచెం, కొంచెం తేరుకో సాగింది. అదికాదు అసలు... అని ఏదో చెప్పబోతుంటే రౌద్రాకారంతో ఆపేసింది, చెప్పనివ్వకుండా. భగవంతుడా దీనికంటే చనిపోవటం మేలు అంటూ కుమిలి పోసాగింది ఉష.

ఏమిటమ్మా ఇది వచ్చినప్పటినుండి చూస్తున్నా. ఇద్దరూ ఎవరికి వారే అన్నట్టున్నారు. అతన్ని చూస్తూనే నువ్వు ముఖం తిప్పుకుని వెళ్ళిపోతున్నావు. అతనూ అంతే. నిన్ననగా వచ్చాను. మీ ఇద్దరిలో మార్పు లేదు. ఏమిటో, ఎప్పుడూ అతని మాటకు జవదాటని నువ్వు, నీ మాటకు విలువనిచ్చే ప్రభా ఇలా ఎందుకు మారిపోయారో? ఈ విషయం తెలిస్తే అమ్మా నాన్న చాలా బాధపడతారు. అసలు ఏం జరిగింది? చెప్పమ్మా అంటూ ప్రేమగా ఆప్యాయంగా అడుగుతూన్న అన్నగారి వైపు కళ్ళనీళ్ళు నిండగా ఉత్తరం సంగతి అంతా చెప్పింది. అది విన్న సుధాకరం నిర్ఘాంత పోతూ! ప్రభా! చాలా మంచివాడమ్మా. అసలు ఆడ వాళ్ళను చూస్తేనే భయపడి, సిగ్గు పడతాడు. అయినా చిన్నప్పటి నుండి చూస్తూనే ఉన్నాం. నీకు మాత్రం తెలియదా? నవ్వు చెబుతున్నట్టుగా, ముందలింపుగా అన్నాడు. తల అడ్డంగా ఊపింది ఉష, కాదన్నయ్యా నాది ఒట్టి అనుమానం కాదు నిజం. మళ్ళీ నమ్మించి గొంతుకోసారు. అయినా ఈ ఉత్తరం చూడు నీకే తెలుస్తుంది. అంటూ ఉత్తరం ఇచ్చింది. ఏమోనమ్మా నాకు నమ్మకం కుదరడం లేదు అన్నాడు ఉత్తరం చదివి బల్ల మీద పెడుతూ. ఇంకా ఏం కావాలన్నయ్యా ఇంతకంటె నిదర్శనం అయినా నా తల రాత ఇలా ఉంది. నిరాశ, వైరాగ్య ధోరణిలో మాట్లాడుతున్న చెల్లెలి వైపు బాధగా, జాలిగా ఔనా! కాదా! అన్నట్టుగా చూస్తూ కూర్చున్నాడు. ఇంతలో బూటు శబ్దం చేసుకుంటూ ప్రభాకరం వచ్చాడు ఆఫీసు నుంచి. అన్నా, చెల్లెళ్ళ మధ్య జరుగుతున్న సంభాషణ అర్థమైంది. ముఖంలో మారుతున్న భావాలను అణచుకుని గాంభీర్యం పులుముకొని అక్కడనుంచి గది లోనికి వెళ్ళిపోయాడు. కాఫీ పట్టుకురా అని చెల్లెలి వైపు నడిచాడు సుధాకరం. వంటింటి వైపు కదిలింది ఉష. గదిలోంచి సుధాకరం మాటలు వినిపిస్తున్నాయి. ప్రభాకరం గొంతు చిన్నదిచేసి చెబుతున్నాడు. కొంత




నేటికి సుధాకరం పకపక నవ్వసాగాడు. ప్రభాకరం కూడ శృతి కలిపాడు. ఉషకి శరీరమంతా మంటల్లో పెట్టినట్లయింది. సన్నగా గుండెల్లో పోటు ప్రారంభమయింది. ఎలా వచ్చిందో తెలియకుండా మంచ మీద వాలిపోయింది.

ఇంతలో గేటు తీసుకుని ఎవరో వచ్చిన శబ్దం. అప్పన్నని మీ అయ్యగారు ఉన్నారా? అని అడగడం వినిపించింది. అది విన్న ప్రభాకరం, పరుగెత్తుకూ రేయ్ వెధవా? ఇక్కడరా అని వెళ్ళడం అంతా గోలగా వినిపిస్తోంది. సుధాకరం నవ్వుతూ గదిలోంచి బయటకు వచ్చాడు. ఉష కోపంగా లేచి కూర్చుంది అన్న వైపు చూస్తూ. ఉష వచ్చేసింది రాణీ, నువ్వు మళ్ళా అన్నాడు సుధాకరం నవ్వుతూ. ఇంతలో ప్రభా! చూపించు నా చెల్లెలిని, ఓరేయ్! మా అల్లుడేడి అంటూ ప్రభాకరాన్ని చేతులతో చుట్టేసి వస్తున్న ఆ ఆగంతకుణ్ణి చూస్తూ నిల్చుంది ఉష. ప్రభాకరం ముఖంలో కనిపిస్తున్న కొంటెతనం ఆమెకు ఏవో అర్థాలు చెప్తుంటే అన్నగారి వైపు చూసింది. అతని ముఖం కూడ తనకేదో చెప్పింది. హృదయం తేలిక కాసాగింది. నమస్కారమమ్మా! మీకు నేను వస్తున్నట్లు చెప్పలేదూ? మీకూ. అని అడుగుతున్న తీరు చూస్తుంటే సిగ్గుతో చితికిపోయింది. నెమ్మదిగా లేచి నమస్కరిస్తూ లేదండీ అన్నయ్యగారూ! చెప్పలేదు, ఇంతమంచి అన్న నాకు వున్నారని అసలండి గట్టిగా అంది ప్రభాకరం వైపు చూస్తూ. అసలు చెప్పనిదైనా? ఆవిడ నన్ను అని నవ్వుతూ బావగారి వైపు చూసాడు. సుధాకరం కూడ నవ్వసాగాడు. తరువాత ఇద్దరూ కథంతా చెప్పారు. అది విని అతను అరె! ఎంత పొరపాటయింది. అసలు నా పేరు రాజశేఖరం. మా అమ్మా, నాన్నకి ఆడపిల్లలు లేరు. అందుకని మా అమ్మ నన్ను రాణీ అని పిలిచేది. ఆవిడకు అమ్మాయి అంటే తగని ముద్దు. ప్రభాగాడు నాకు బావ అవుతాడు. అందుకని అలా అంటూండేవారంతా మీకీ సంగతి చెప్పలేదు. ఈ వెధవ అని ప్రభాకరం వైపు తిరిగి ఏరా! అవునా? అన్నాడు. దానితో మళ్ళీ నవ్వులు. లేదండి చెప్పారు రాజశేఖరంగా ఈ ఉత్తరం చూసి నేను పొరపడ్డాను. రాణి అంటే ఎవరో అని అంది సిగ్గుపడుతూ. పోని ఇప్పటికైనా తెలిసిందా? అన్నాడు చిలిపిగా చూస్తూ ప్రభాకరం. ఆఁ ఆఁ తెలిసింది అంది చిరుకోపం నటిస్తూ ఉష. నా ఉత్తరం ఇంత పని చేసిందన్నమాట. ఎంత ఘోరం, ఎంత ఘోరం, మాటలకి నవ్వులు ప్రతిధ్వనించాయి. ఆ గదిలో నిద్దరలో ఉన్న రాఘవేంద్ర లేచి పెద్దవాళ్ళ సంతోషం అర్థం కాకపోయినా చూసి, చూసి తనూ నవ్వసాగాడు.

కథాంజలి
[కథల మాస పత్రిక]
స్థాపితం: 1938

విడి ప్రతి ... ...0-25 పైసలు
సం॥ చందా ... ... రూ. 7-50
(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాథమ్స్ బుక్ స్టాలులలోనూ దొరుకును.